క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బ్యూల

హాలహర్వి: మండలంలోని హాలహర్వి, చింతకుంట, బేవినహాల్, అర్ధగేరి, సాకిబండ, ఎం.కె.పల్లి, సిరిగాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దార్ బ్యూల పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని కరెంట్, ఫర్నీచర్, నీటివసతి, మూత్రశాలలు, వృద్ధులు, దివ్యాంగుల కోసం ర్యాంపులను పరిశీలించారు. అలాగే ఎన్నికలకు కావాల్సిన ఏర్పాట్లను ముందస్తుగా పరిశీలించడం జరిగిందన్నారు. ఈమె వెంట రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు లింగప్ప, లోకవీర్, విజయ్, బీఎల్వోలు, శరణబసవ, గౌతమి, అంబిక, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మారెమ్మ దేవర

హొళగుంద: మండల కేంద్రంలో వెలసిన మారెమ్మ దేవి దేవర కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంగిపూజతో పాటు కుంభోత్సవం, ఆలయంలో అభిషేకాలు, ఇతర ప్రత్యేక పూజలు ఉంటాయని, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని గ్రామస్తులు కోరారు. వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త విరుపాక్షి ఇచ్చిన రూ.10 వేలు విరాళాన్ని నాయకులు దొడ్డబసప్ప, పంపాపతి, మజ్జిగ సిద్దయ్య, గడిగే బసవ, గాదెప్ప, బిడ్డన్న, సిద్దప్ప పూజారులకు అందజేశారు.

బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

చిప్పగిరి: మూడు రోజుల క్రితం ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేమకల్లు గ్రామానికి చెందిన వలంటీర్ హేమలతకు వైఎస్సార్‌సీపీ ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బసినె విరూపాక్షి రూ.20 వేలు ఆర్థిక సాయం అందించారు. ఆపదలో ఉన్న తమకు సాయం చేయడంపై ఆ కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ మారయ్య, నాయకులు చంద్రశేఖర్, ప్రేమ్‌కుమార్, సేనాపతి తదితరులు పాల్గొన్నారు.

10న రాష్ట్రస్థాయి భజన పోటీలు

ఆస్పరి: మండలంలోని తంగరడోణ గ్రామంలో ఈనెల 10వ తేదీన చింతమునిస్వామి, నల్లారెడ్డి స్వామి ఆరాధనోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి భజన పోటీలు నిర్వహించనున్నట్లు గురువారం గ్రామ పెద్దలు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి అర తులం బంగారు, తర్వాతి స్థానాల వారికి వరుసగా 30 తులాల వెండి, 25, 20, 15, 12, 10, 8, 6, 5 తులాలు వెండి అందించనున్నట్లు చెప్పారు. పోటీలో పాల్గొనే వారు రూ.400 ఎంట్రీ ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు 98492 81708, 90003 71857 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన

వెల్దుర్తి(కృష్ణగిరి): కేంద్ర ప్రభుత్వ విశ్వకర్మ యోజన పథకంపై బీజేపీ నాయకులు మండలంలోని మహిళలకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక భజన మందిరంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ పత్తికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రంజిత్ కర్ణి మాట్లాడుతూ పథకాన్ని మహిళలు, కుల వృత్తులవారు ఉపయోగించుకోవాలని సూచించారు. పథకానికి దరఖాస్తు, అమలు విధానాలను వివరించారు. బీజేపీ నాయకులు చంద్రశేఖర్, గీతామాధురి, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దికెర: ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. గురువారం మండల పరిధిలోని హంప గ్రామంలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి వసతులపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ అధికారులు మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ఓటర్లు ఇబ్బందులు పడకుండా నేరుగా పోలింగ్ కేంద్రాలకు చేరుకునేలా రూట్ మ్యాప్‌లు తయారు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఆర్ఐ రవికుమార్ తదితరులు వెంట ఉన్నారు.

మార్లమడికి రోడ్డుకు మహర్దశ

- త్వరలో డబుల్ రోడ్డు పనులు ప్రారంభం
- చురుగ్గా సాగుతున్న సర్వే పనులు



హొళగుంద సమీపంలో మార్లమడికి రోడ్డులో సర్వే పనులు చేస్తున్న దృశ్యం



గతంలో అధ్వానంగా ఉన్న రోడ్డు (ఫైల్)

హొళగుంద: ఆంధ్ర–కర్ణాటకను కలిపే 5 కి.మీ మార్లమడికి పంచాయతీరాజ్ రోడ్డును రెండు లైన్ల రహదారిగా మార్చేందుకు రూ.5.40 కోట్ల నిధులు మంజూరై వారం, పది రోజుల్లో పనులు మొదలుకానున్నాయి. అందులో భాగంగా కాంట్రాక్టర్ పనులు మొదలు పెట్టేందుకు గాను అవసరమైన సర్వే పనులు చేపట్టారు. ఇంతకుముందు మార్లమడికి రోడ్డు పనులు ప్రారంభమై వివిధ కారణాలతో అర్ధాంతరంగా ఆగిపోయిన సంగతి తెలిసిందే. అధికారులు మరోసారి చర్యలు చేపట్టి సింగిల్ రోడ్డు నుంచి డబుల్ రోడ్డుగా మార్చేందుకు కొత్త ఎస్టిమేషన్లు తయారు చేసి పంపించగా ప్రస్తుతం నిధులు మంజూరయ్యాయి. స్థానిక వాల్మీకి సర్కిల్ నుంచి ఎల్లెల్సీ బ్రిడ్జ్ దాటి కొద్ది దూరం వరకు (400 మీటర్లు) డబుల్ సీసీ రోడ్డు అక్కడి నుంచి మార్లమడికి వరకు దాదాపు 4 కి.మీ డబల్ తారు రోడ్డు వేయనున్నారు. ఈ మార్గంలో నిత్యం వేలాది మంది కర్ణాటకలోని బళ్లారి, సిరుగుప్ప పట్టణాలతో పాటు ఇతర ప్రాంతాలకు హొళగుంద, పల్లెల నుంచి విద్య, వైద్యం, ఇతర పనులకు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలో ఈ రోడ్డు అడుగడుగునా గతుకులు, భారీ గుంతలతో అధ్వానంగా ఉండి ప్రయాణంలో నరకాన్ని చూపించేది. ఐదు కి.మీ ప్రయాణం అరగంటకు పైగా సమయం తీసుకుంటుందంటే రోడ్డు పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ప్రస్తుతం మార్లమడికి రోడ్డును బాగుచేస్తుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వాటితో పాటు ఇప్పటికే మండలంలోని పలు గ్రామాల రోడ్లకు మరమ్మతు పనులు పూర్తయ్యాయి.

వాటి వివరాలు ఇలా...

- రూ.1.85 కోట్లతో 5 కి.మీ కోగిలతోట రోడ్డు
- రూ.1.85 కోట్లతో హెబ్బటం–ఇంగళదహాళ్ 3 కి.మీ రోడ్డు
- రూ.55.87 లక్షలతో వందవాగిలి రోడ్డులో గాది లింగప్ప గుడి నుంచి గ్రామంలోకి కిలోమీటర్ రోడ్డు
- రూ.1.20 కోట్లతో 1.9 కి.మీ సమ్మతగేరి రోడ్డు
- రూ.77.40 లక్షలతో 1.35 కి.మీ పెద్దహ్యాట రోడ్డు
- రూ. 62.36 లక్షలతో 1 కి.మీ ముగుమానుగుంది రోడ్డు

వీటిలో పాటు లింగంపల్లి, ఆలూరు రోడ్డుకు సంబంధించి సుళువాయి, ఎల్లార్తి మీదుగా ఉన్న రోడ్లు కూడా బాగయ్యాయి.

సకాలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

కృష్ణగిరి: సీనియారిటీ ప్రకారం అర్హులైన రైతులందరికీ విద్యుత్ కనెక్షన్లు అందజేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. కృష్ణగిరి సబ్‌స్టేషన్‌లో గురువారం ఆయన రైతులతో మాట్లాడారు. 2019లో పెండింగ్‌లో ఉన్న రైతులందరితోపాటు గతేడాది జూలై వరకు డీడీలు కట్టిన వారికి కూడా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరయ్యాయన్నారు. వీటిని సీనియారిటీ జాబితా ఆధారంగా అందజేస్తున్నామన్నారు. అలాగే ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాటికి కూడా స్తంభాలు అందజేస్తున్నామని, త్వరలో ట్రాన్స్‌ఫార్మర్లు కూడా ఇస్తామన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారు తప్పనిసరిగా వాల్టా చట్టం సర్టిఫికెట్‌ను తీసుకురావాలని రైతులకు సూచించారు.

టైర్ల చోరీపై కేసు నమోదు

కృష్ణగిరి: కంబాలపాడు గ్రామ శివారులో వైఎస్సార్ సుజల స్రవంతి మదర్ ప్లాంటు వద్ద ట్రాక్టర్ల టైర్లు చోరీ కావడంపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గతేడాది డిసెంబర్ 30న రాత్రి మదర్ ప్లాంటు వద్ద ఉన్న నాలుగు ట్రాక్టర్లలో మూడింటి నుంచి ఆరు టైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసిన విషయం విదితమే. దీనిపై చుట్టుపక్కల గ్రామాల్లో విచారించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరినాథ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

వివాదాస్పద స్థలాలను పరిశీలించిన సబ్ కలెక్టర్



హొళగుందలో వివాద స్థలంలో స్థానికులతో మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ

హొళగుంద: మండల కేంద్రం హొళగుంద బీసీ కాలనీలో వివాదాస్పదంగా మారిన సామూహిక మరుగుదొడ్ల స్థలంతో పాటు గజ్జహళ్లి, హొళగుంద తదితర గ్రామాలలో భూములను ఆదోని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ గురువారం పరిశీలించారు. వన్ టైమ్ సెటిల్‌మెంట్‌తో రైతులు తమ పొలాలను నాన్ అగ్రికల్చర్‌గా మార్పు చేసుకోవడానికి పెట్టుకున్న దరఖాస్తులకు సంబంధించి ఆయన ఆ గ్రామాలలో పర్యటించారు. దరఖాస్తులో పొందుపరిచిన రికార్డుల మేరకు పొలాలను పరిశీలించి తహసీల్దారు ప్రసాద్‌రాజుకు సూచనలిచ్చారు. అదేవిధంగా హొళగుంద బీసీ కాలనీలో వివాదాస్పద స్థలాన్ని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని స్థానిక మహిళలకు హామీఇచ్చారు. అనంతరం మాట్లాడుతూ ఆదోని డివిజన్‌లో వలసల నివారణ, తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. రైతుల నుంచి సర్వేయర్లపై ఆరోపణలు వస్తున్నాయని తీరు మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులు, సిబ్బంది పని తీరు తదితర వాటి గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఆర్ఐ దినోజ్, సర్వేయర్ శ్రీనివాసులు, వీఆర్ఓలు తదితరులు ఉన్నారు.

రిజిస్ట్రేషన్లు వేగవంతం చేయండి



హెబ్బటం సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రసాద్‌రాజు

హొళగుంద: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తహసీల్దారు ప్రసాద్‌రాజు, ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వర గౌడ్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. వారు గురువారం హెబ్బటం గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం కింద ప్రభుత్వం లబ్ధిదారులకు ఇచ్చిన ప్రతి ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి టార్గెట్‌ను పూర్తిచేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంగా పని చేస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న సర్పంచ్ అరుణ్‌కుమార్, నాయకులు

దేవనకొండ: మండలంలోని తెర్నెకల్ గ్రామంలో మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం గురువారం భూమిపూజ చేసినట్లు గ్రామ సర్పంచ్, కర్నూలు జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు మొగతాళ్ అరుణ్ కుమార్ తెలిపారు. దీంతో దశాబ్దాల కాలం నుంచి ఉన్న నీటి సమస్యకు తెరపడనుందని చెప్పారు. గ్రామంలోని కొత్త ఎస్సీ కాలనీ, రామమ్మపేట, యల్లమ్మపేటకు ఎన్నో దశాబ్దాల నుంచి మంచినీటి సమస్య ఉండేదని, జలజీవన్ మిషన్ కింద రూ.40 లక్షలు మంజూరు కాగా రెండు బోర్లు వేయించడం జరిగిందన్నారు. తద్వారా 40 వేల లీటర్ల సామర్థ్యం గల ట్యాంకు నిర్మాణానికి అనుమతులు లభించాయని చెప్పారు. కులమతాలకు అతీతంగా క్రైస్తవ పద్ధతిలో సాదోక్, ముస్లిం పద్ధతిలో ముక్తుమ్‌వలీ, హిందూ సాంప్రదాయ పద్ధతిలో పూజారి భాను భూమిపూజ చేపట్టారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కోశాధికారి మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ శీను, నాయకులు ఈరన్న, రాఘవేంద్ర, గడ్డం నాగరాజు, రామానాయుడు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

'సిద్ధం' సభను విజయవంతం చేద్దాం

ఆలూరు: ఈనెల 18న అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించే సిద్ధం సభను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్య, ఆలూరు నియోజకవర్గ సమన్వయకర్త బూసినె విరుపాక్షి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు



సోమలగూడూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

నందవరం: గ్రామాల్లో ప్రశాంతతకు భంగం కలిగించేలా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ సీతారామయ్య హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని టి.సోమలగూడూరు గ్రామంలో సీఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులతో డీఎస్పీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అల్లర్లకు పాల్పడకుండా శాంతియుతంగా జీవించాలని గ్రామస్తులకు సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేలా ప్రతిఒక్కరూ సహకారించాలన్నారు. ఎన్నికల వేళ అల్లర్లు, గొడవలకు పాల్పడితే శిక్ష తప్పదన్నారు. ఎస్ఐ తిమ్మయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎం పనితీరుపై అవగాహన

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఫారం–6, 7, 8తో పాటు ఈవీఎం మిషన్ పనితీరుపై బీఎల్‌ఓలు, సెక్టోరియల్ ఆఫీసర్లకు తహసీల్దారు ప్రసాద్‌రాజు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఫారం–6, 7, 8, 8ఏ లను ఏ విషయానికి వాడాలి, దరఖాస్తులో తప్పులుంటే సరి చేయాలని సూచనలిచ్చారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. దొంగ ఓట్లు తొలగించడం, ప్రతి దరఖాస్తుదారుడి పేరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



అక్రమ మద్యాన్ని చూపుతున్న ఎస్ఐ తిమ్మయ్య

నందవరం: మండలంలోని నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యంను స్వాధీనం చేసుకుని వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ మాట్లాడుతూ.. మండల పరిధిలోని కనకవీడు గ్రామానికి చెందిన మాల గిడ్డయ్య అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తుండగా నాగలదిన్నె చెక్‌పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. నిందితుడి వద్ద నుంచి కర్ణాటక మద్యం 480 జాన్స్ ఒరిజినల్ ఛాయస్ డీలెక్స్ విస్కీ టెట్రా ప్యాకెట్ల (90 ఎంఎల్)ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చిప్పగిరి: మండలంలో నిర్వహించిన ఆకస్మిక దాడులలో బైక్‌పై కర్ణాటక మద్యం అక్రమంగా తరలిస్తున్న మొగలగవల్లి గ్రామానికి చెందిన ఎరుకల మహేష్‌ను రామదుర్గం పరిసర ప్రాతంలో పట్టుకున్నట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. నిందితుడి నుంచి 672 హైవార్డ్ విస్కీ 90 ఎంఎల్ టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది యశ్వంత్, కృష్ణసాగర్ తదితరులు ఉన్నారు.

కార్మిక హక్కులను కాలరాసిన కేంద్రం



ఎమ్మిగనూరులో ధర్నా చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పోరాడి సాధించుకొన్న కార్మిక హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఐఎఫ్‌టీయూ డివిజన్ కార్యదర్శి బాలరాజు ఆరోపించారు. గురువారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం ముందు కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ పరం చేయడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. కార్మికులు సాధించుకున్న హక్కులను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్లను అమల్లోకి తెచ్చిందన్నారు. ఆ లేబర్ కోడ్లను సత్వరం రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు కోరారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేసే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఆ సంఘ నాయకులు సత్యన్న, నరసింహులు పాల్గొన్నారు.


పండ్ల తోటల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



బాటతండ వద్ద వైఎస్సార్ జలకళ బోరును పరిశీలిస్తున్న ఏపీడీ పక్కీరప్ప

తుగ్గలి: పండ్ల తోటల పెంపకంతో రైతులు ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ఏపీడీ పక్కీరప్ప సూచించారు. గురువారం మండల పరిధిలోని బాటతండలో ఉపాధి హామీ పథకం కింద రైతులు నాటుకున్న మామిడి తోటలు, వైఎస్సార్ జలకళ బోర్లను పరిశీలించారు. ఉపాధి పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం మూడేళ్ల పాటు నిధులు ఇస్తుందన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఉచితంగా బోర్లు తవ్వించి మోటారు, విద్యుత్తు తదితర వాటన్నంటినీ ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. అంతకుముందు ఉపాధి పనులపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఏపీఓ రామకృష్ణ, క్లస్టర్ టీఏ గంగన్న, ఈసీ ప్రదీప్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ రాజునాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు బీమానాయక్ ఉన్నారు.

ఉన్నతంగా రాణిస్తే గుర్తింపు



బహుమతులు అందుకుంటున్న క్రీడాకారులు

మద్దికెర: క్రీడాపోటీల్లో ఉన్నతంగా రాణించినప్పుడే తగిన గుర్తింపు లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, సర్పంచ్ సుహాసిని, ఎంఈఓ గోపాల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నిర్వహించిన ఆడుదాం–ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా స్థాయిలో రాణించిన విద్యార్థులకు గురువారం స్థానిక కమ్యునిటీ హాలులో విజయోత్సవ సభ ఏర్పాటు చేసి అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇలాంటి అవకాశాలు అరుదుగా వస్తుంటాయని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని సూచించారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని కోరారు. అనంతరం క్రీడాకారులను ట్రోఫీలను అందజేశారు. ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఏఓ స్వర్ణలత, పీడీలు సంజప్ప, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, శ్రీనివాసులు, సునీత, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ మొట్టమొదటి డిప్యూటీ కమిషనర్‌గా హెచ్‌జీ.వెంకటేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గురువారం ముందుగా ఈరన్న స్వామిని దర్శించుకుని బాధ్యతలను తీసుకున్నారు. ఇక్కడ పని చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ వాణి కాణిపాకం దేవాలయానికి బదిలీపై వెళ్లారు.


వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు



మాట్లాడుతున్న ఎంపీడీఓ సోనిబాయి

గోనెగండ్ల: వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని, అలాగే గ్రామాల్లో ప్రస్తుతం నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కారించాలని ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన, ఎంపీడీఓ సోనిబాయి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో మంచినీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. జలజీవన్ మిషన్ కింద రూ.35 కోట్లు మంజూరయ్యాయని, గోనెగండ్ల, అలువాల తదితర గ్రామాల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయి. ఆ పనులు పూర్తయితే ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఏపీఓ మహబూబ్ బాష మాట్లాడుతూ.. పండ్లతోటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. అలాగే మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించడంతో ప్రతి కూలీకి 150 రోజులు ఉపాధి పనులు కల్పించనున్నట్లు చెప్పారు. ఈఓ హేమలత మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ఆర్‌బీకేల్లో రైతులచే ఈ–కేవైసీ చేయిస్తున్నట్లు వివరించారు. ఇంకా ఈకేవైసీ చేయించుకొని రైతులు ఈనెల 15వ తేదీలోపు చేయించుకోవాలన్నారు. ఈఓఆర్డీ నాగేష్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో కొకుళాయిలు, ట్యాంక్‌ల దగ్గర లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెలాఖరుకల్లా ఇళ్లు, కొళాయి తదితర పన్నులను వందశాతం వసూలు చేస్తామన్నారు. అనంతరం ఎంపీడీఓ సోనిబాయి మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్యపై సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు దృష్టి పెట్టాలన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. హౌసింగ్ డీఈ ప్రసాద్, ప్రజా ప్రతినిధులు వెంకట్రామిరెడ్డి, బందెనవాజ్, రజియా సుల్తానా, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

జోరుగా ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్



రిజిస్ట్రేషన్ కోసం వేలిముద్రలును నమోదు చేస్తున్న అధికారులు

చిప్పగిరి: జగనన్న కాలనీలలో ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మండలంలోని ఆయా గ్రామాలలో జోరుగా సాగుతుంది. మండలంలోని దౌల్తాపురం సచివాలయంలో సిబ్బంది లబ్ధిదారుల వేలిముద్రలు నమోదు చేసుకుని ఇళ్లస్థలాలను వారి పేరిట రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేయించి ఇళ్ల స్థలాలపై సంపూర్ణ హక్కులకు కల్పిస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేంద్ర, వీఆర్ఓ చంద్రనాయక్, డిజిటల్ అసిస్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: జగనన్న లే అవుట్లలో ఇంటి స్థలాలు పొంది ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని ఆయా సచివాయాల పరిధిలోని లేఅవుట్లలో 796 మందికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చింది. వాటిలో ఇప్పటివరకు 436 రిజిస్ట్రేషన్లు చేశారు. గిరిగెట్ల, పగిడిరాయి సచివాలయాల్లో జరుగుతున్న రిజిస్ట్రేషన్లను గురువారం ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ గోపాల్ పరిశీలించారు. మిగతా లబ్ధిదారులు శుక్రవారం లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

భారత్ బ్రాండ్ సరుకుల విక్రయాలు ప్రారంభం

ఆదోనిఅర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేస్తున్న భారత్ బ్రాండ్ గోధుమపిండి, శనగపప్పు విక్రయాలను ఆదోని మార్కెట్ యార్డులోని కేడీసీఎంఎస్ కేంద్రంలో గురువారం బీజేపీ అసెంబ్లీ కో–కన్వీనర్ నాగరాజుగౌడ్, పట్టణాధ్యక్షుడు సాయి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను అదుపు చేయాలనే సంకల్పంతో సబ్సిడీ ధరకు సరుకులను పంపిణీ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. కిలో శనగపప్పు రూ.60, గోధుమ పిండి రూ.27.50 కే అందిస్తున్నట్లు చెప్పారు. త్వరలో భారత్ రైస్ కూడా అందుబాటులోకి వస్తుందన్నారు. కేడీసీఎంఎస్ మేనేజర్ ప్రకాష్‌రెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి విజయకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు మహదేవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి దేవేంద్రకుమార్, కార్యదర్శి అంజి తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఉద్యోగరీత్యా పనిచేసిన చోట అందించిన సేవలే గుర్తింపునిస్తాయని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్ రెడ్డి అన్నారు. కృష్ణగిరి స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొంది డోన్ రూరల్ స్టేషన్‌కు బదిలీ అయిన వెంకటేశ్వర్లుకు గురువారం ఆయన కృష్ణగిరి, వెల్దుర్తి ఎస్ఐలు ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, పి.చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది వీడ్కోలు పలికారు. శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. సెబ్ హెడ్ కానిస్టేబుల్ ఖాజా హుసేన్, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.